


# బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇవ్వండి

మరోసారి మోడీని గెలిపించండి
విజయ సంకల్ప సభ సన్నాహక సమావేశం


# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 214 | సోమవారం | 26 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




# శభాష్.. శబరీష్

జాతరలో అన్నీ తానై..

ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు

క్రౌడ్ కంట్రోల్ సవాలే..

తల్లుల ఆశీర్వాదంతో సక్సెస్..



ములుగు జిల్లా పోలీస్ బాస్‌గా బాధ్యతలు చేపట్టగానే ఆసియా ఖండంలో అతిపెద్ద గిరిజన మేడారం జాతర నిర్వహణ అనే గొప్ప అవకాశం ఆ అధికారికి దక్కింది. ఆయన దాన్ని సవాల్ స్వీకరించారు. పక్కా ప్రణాళికతో అంకుఠిత దీక్ష, పట్టుదలతో నిద్రాహారాలు మాని పనిచేశారు. ఈ మహా జాతరకు తరలివచ్చే భక్త జనం రద్దీకి తగ్గట్టుగా ప్రణాళిలను సిద్ధం చేసి ముందుకు కదిలారు. కోటిన్నర భక్తులు సులభతరంగా సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేసి "శభాష్ శబరీష్" అని అనిపించుకున్నారు. మేడారం మహా జాతర విజయవంతంలో కీలకపాత్ర పోషించిన ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ పి. శబరీష్ పై వరంగల్ వాయిస్ ప్రత్యేక కథనం..

వివరాలు 2లో..

- వరంగల్ వాయిస్, ప్రత్యేక ప్రతినిధి




## పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి

కలెక్టర్ పి.ప్రావీణ్య




## 28న ఆత్మకూరులో ధర్నా

పాల్గొననున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు
విజయవంతం చేయాలని చల్లా పిలుపు




## గుండెజారి గల్లంతయ్యింది..

## మానుకోట మార్కెట్ ఎస్టీ రిజర్వ్

రైతు బిడ్డ కోసం కాంగ్రెస్ వేట

# శభాష్.. శబరీష్



- గడ్డం కేశవమూర్తి

## జాతరలో అన్నీ తానై..
## ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు
## క్రౌడ్ కంట్రోల్ సవాలే..
## తల్లుల ఆశీర్వాదంతో సక్సెస్..

తెలంగాణ కుంభమేళా మేడారం మహాజాతరకు కోటిన్నర మంది పైగా భక్తులు తరలి వచ్చారు. ఈ రద్దీకి తగిన భద్రత, బందోబస్తు కల్పన తలకు మించిన భారమే. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులతో ములుగు జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ శబరీష్ సమన్వయంతో పని చేయడంతో మహాజాతర అనే క్రతువు సాఫీగా సాగింది. ఎస్పీ శబరీష్ జాతరలో అన్ని తానై నిద్రాహారాలు మాని పనిచేశారు. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ముందుకు కదిలారు.

### తల్లుల ఆశీర్వాదంతో ముందుకు..

ములుగు జిల్లా ఎస్పీగా రావడంతోనే ఆసియాలో అతిపెద్ద జాతర అయిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో నిర్వహాణ బాధ్యతలు తనకు రావడం చాలా సంతోషంగా ఉందని జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు. ముఖ్యంగా జాతరకు వచ్చే భక్తులకు అమ్మల దర్శనం అయ్యి మళ్లీ వారు ఇంటికి తిరిగి వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుంగా చేశాం. కోటిన్నర మంది భక్తులను కంట్రోల్ చేయడం సవాల్ తో కూడిన పని. అయినా పోలీసు శాఖ ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా నిద్రాహారాలు మాని పనిచేశాం. పోలీసు శాఖ కృషితో మేడారం మహాజాతరను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుంగా ప్రశాంతంగా నిర్వహించగలిగాం. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాలు.





### స్వాగత సూచికగా ఎస్పీ కాల్పులు..

కోటిన్నర భక్తులు తరలివచ్చిన మహాజాతరకు బందోబస్తు సవాల్ తో కూడిన ప్రక్రియ. దీన్ని ములుగు జిల్లా పోలీస్ బాస్ ఎస్పీ శబరీష్ అంకురిత దీక్ష, పట్టుతల, పక్కా ప్రణాళికతో పనిచేసి తన సత్తాను చాటుకున్నారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను జనం మధ్యలోకి తీసుకు వచ్చే ఘట్టంలో పోలీసు బాస్ గాల్లోకి కాల్పులు జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ఆ అవకాశం తనకు రావడం. ఏకే 47తో గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపి అధికారికంగా సమ్మక్కకు స్వాగతం పలకడం తన సర్వీస్ లో గుర్తుండిపోయే సంఘటన అన్నారు.



### క్రౌడ్ కంట్రోల్ సవాలే..

మేడారం జాతర సక్సెస్‌లో పోలీసులదే కీలకపాత్ర. అలాంటి పోలీసు వ్యవస్థలో ములుగు జిల్లా ఎస్పీగా ఉన్న డాక్టర్ పి.శబరీష్ మేడారం జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతం జేయడంలో కృతకృత్యులయ్యారు. జాతరకు రెండు నెలల ముందు నుంచే ప్రత్యేక దృష్టిసారించి అసాంతం తనదైన శైలిలో ఎస్పీ శబరీష్ పనిచేశారు. క్రౌడ్ కంట్రోల్ కు ప్రత్యేక ప్రణాళితో ముందుకు వెళ్లారు. ఇలా ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షించి మేడారం మహా జాతరను విజయవంతం చేశారు.

### ట్రాఫిక్ కంట్రోల్ పై ఫోకస్

మేడారం జాతరలో ట్రాఫిక్ కంట్రోల్ అనేది చాలా పెద్ద సమస్య. అలాంటి అంశంపై ఎస్పీ శబరీష్ ప్రత్యేక దృష్టి సారించి పనిచేశారు. జాతరకు ఆర్టీసీ ఆరువేల బస్సులను నడపడంతో పాటు, ఇతర ప్రైవేట్ వాహనాలు కూడా భారీ సంఖ్యలో జాతరకు వచ్చాయి. వీటి కోసం పార్కింగ్, ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకునేందుకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఓ పార్కింగ్ సెక్టార్, ఆ సెక్టార్ కు ఓ డీఎస్పీ స్థాయి అధికారిని ఇంచార్జిగా నియమించారు. జాతర బందోబస్తులో భాగంగా 500 సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. 1400 ఎకరాల్లో 33 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి దాదాపు 5 లక్షల వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఆర్టీసీ కోసం 70 ఎకరాల్లో ప్రత్యేక ప్రయాణ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి నిత్యం అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు.



### ప్రజాప్రతిధులు, ఉన్నతాధికారుతో సమన్వయం..

జాతరలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, వివిధ శాఖల అధికారులు, రాష్ట్ర డీజీపీ రవిగుప్తాతో నిత్యం జిల్లా ఎస్పీ శబరీష్ సంప్రదింపులు జరుపుతూ బందోబస్తు బాధ్యతలు నిర్వహించారు. జాతరకు సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళిసై , కేంద్రమంత్రులు అర్జున్ ముండా, కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధశికారులు వచ్చిన సమయంలో వారి ప్రొటో కాల్ ప్రకారం బందోబస్తు నిర్వహించి తన సత్తా ఏంటో చూపారు. గత జాతరల్లో పనిచేసిన అధికారుల సేవలను ఎస్పీ శబరీష్ ఈ జాతరలో వినియోగించుకుకొని సక్సెస్ అయ్యారు. మేడారం మహాజాతరలో 15000 మంది పోలీసులను సమన్వయ పరుస్తూ బందోబస్తు నిర్వహించారు.

### సమస్యలను సరిచేసి...

జాతరలో సమ్మక్క-సారలమ్మలు గద్దెపైకి తీసుకువచ్చే ఘట్టం, రెండు రోజుల పాటు తల్లులు గద్దెలపై కొలువుండే సమయంలో భక్తుల తాకిడిని కంట్రోల్ చేయడం కత్తీమీద సాములాగా మారింది. అయినా కూడా ఎస్పీ శబరీష్ ఎప్పటికప్పుడు తన సిబ్బందికి సూచనలు చేస్తూ సమస్యను పరిష్కరించారు. 21 బుధవారం నుంచి 24 బుధవారం వరకు నాలుగు రోజులు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో తాడ్వాయి-మేడారం మార్గ మధ్యలో తరుచూ ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడింది. వెంటనే ఎస్పీ శబరీష్ రంగంలోకి దిగి దగ్గరుండి ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించారు. ఇలా ఎక్కడా ఏ సమస్య వచ్చినా ఆయనే ప్రత్యక్షమై అన్ని తానై జాతరలో పనిచేశారు.

### అన్నీ తానై..

రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతర విజయవంతమైంది. ఎన్నడూ లేనిది జాతర చివరి రోజు కూడా లక్షలాది మంది తరలివచ్చారు. అమ్మలను దర్శించుకొని ఇంటిబాట పట్టారు. మేడారం మహా జాతర సక్సెస్ కావడం వెనుక ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ అన్నీ తానై చేసిన కృషి దాగి ఉంది. జాతరకు ముందు రెండు నెలలుగా ముందస్తు ప్రణాళికతో పనిచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జిల్లా ఎస్పీ శబరీష్ ప్రత్యేక చొరవ చూపారు.



# మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి

## టీయూడబ్ల్యూజే నాయకుల హర్షం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె .శ్రీనివాస్ రెడ్డిని నియమించడం పట్ల టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, గుంటి విద్యాసాగర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి, పిన్నా శివకుమార్, పీవీ మదన్ మోహన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ జర్నలిస్టు అయిన శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో జర్నలిస్టులకు ఎంతగానో మేలు చేకూరనుందని తెలిపారు. జిల్లాలో జర్నలిస్టులుఎదుర్కొన్న సమస్యలను శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రధానంగా జర్నలిస్టుల హెల్త్ కార్డులతో పాటు ఇల్లు, ఇళ్ల స్థలాలపై శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా జర్నలిస్టులకు సముచితమైన న్యాయం జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇటీవల మేడారంలో పర్యటన సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను త్వరగా పరిష్కారం చేస్తామని ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీనివాసరెడ్డికి అరసం అభినందనలు..

తెలంగాణా రాష్ట్ర మీడియా అకాడెమీ చైర్మన్ గా కె.శ్రీనివాసరెడ్డి నియామకమైనందున తెలంగాణ రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. వారి అపూర్వమైన అనుభవ సంపత్తి మీడియా మిత్రులకు, మేధావులకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నారాయణ, డా.పల్లేరు వీరాస్వామి, డా.రాపోలు సుదర్శన్, నిధి, బి.నాగభూషణం, కే.వి.యల్ , చంద్రమోహన్ గౌడ్, మలారెడ్డి, మద్దిలేటి, గులాబీలు మల్లారెడ్డి, ఏలేశ్వరం వెంకటేశ్, కాళీదాసు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## ఐజేయూ ములుగు జిల్లా ..



**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ గా ప్రజాపక్షం ఎడిటర్ సంపాదకుడు ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె. శ్రీనివాస్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఐజేయూ ములుగు జిల్లా ప్రజాపక్షం ప్రతినిధి ఆలుగొండ రమేష్ తెలియజేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా నియమించబడిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సైతం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తారని అన్నారు. జర్నలిస్టులకు రాబోయే రోజుల్లో అంతా మంచి జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఐజేయూ జిల్లా నాయకులు కొండం రవీందర్, గంపల శివ, వాసు, జాలిగం శ్రీనివాస్, బైకని నటరాజు, చుంచు రమేష్, కేతిరి భిక్షపతి, ఒద్దుల మురళీ, ఎనగందుల శంకర్, కొమురయ్య, తదితరులు ఉన్నారు.

## పెళ్లి రోజు సందర్భంగా అన్నదానం



**వరంగల్ వాయిస్, దంతాలపల్లి :** మండలంలోని బీరిషెట్టిగూడెంనకు చెందిన మిడతపల్లి సురేందర్, మనితల వివాహ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్ద ముప్పారం గ్రామంలో గల అమ్మ ఒడి ప్రేమ శరణాలయంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు అన్నదాన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, అదేవిధంగా పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వని కళాశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక వరంగల్ శివనగర్ తమ్మర భవన్ లో సోమవారం జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలలో మొదటి, రెండవ సంవత్సరాలకు సంబంధించి సుమారు వేలాదిమంది విద్యార్థులు హాజరవుతున్నారని, పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంల వద్ద సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఒక్కొక్క పరీక్ష కేంద్రాల వద్ద ఏఎన్ఎంలను, పరీక్ష హాల్ వద్ద మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదేవిధంగా పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వని ప్రైవేట్ కళాశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిల్లా సహాయ సాగర్, మౌటం శివ కుమార్, సంతోష్, రాజేష్, నీవిల్, అభిరామ్, ప్రభాస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం మహాజాతర విజయవంతం

### అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు

### కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్



**వరంగల్ వాయిస్, ములుగు :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద మేడారం మహాజాతర విజయవంతం చేసిన అన్ని శాఖ అధికారులకు ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం పైడాకుల అశోక్ మేడారం మహాజాతర ఉద్దేశించి ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద మేడారం సమ్మక్క -సారలమ్మ జాతర కోటి 40 లక్షల భక్త ప్రజానీకానికతో జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జిల్లా కలెక్టర్, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు, ఐటీడీఏ అధికారులు, ఎస్పీ అండ్ పోలీస్ యంత్రాంగం, ఇరిగేషన్ శాఖ, అటవీ శాఖ, వైద్యశాఖ, కార్మిక శాఖ, ట్రస్ట్ బోర్డు చైర్మన్, డైరెక్టర్ లకు, జిల్లా అధికారిక అన్ని రంగాల యంత్రాంగానికి, మేడారం మహా జాతర విశిష్టతను ప్రతి ఒక్కరికి తెలియజేసి కష్టపడిన పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు ధన్యవాదాలు చెప్పారు. అదేవిధంగా ముఖ్యంగా ఒంటి చేతితో మేడారం మహాజాతర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

## నకిలీ వరి విత్తనాలతో నష్టం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని శ్రీ బాలాజీ అగ్రీ మాల్ షాప్ లో ఆర్.ఎన్.ఆర్ నకిలీ వరి విత్తనాలను 10 మంది గిరిజన రైతులు కొనుగోలు చేసి 30ఎకరాలలో సాగు చేశారు. ప్రస్తుతం 30 ఎకరాలలో సాగు చేసిన 50రోజులకే పంట కంకులు వేసింది. 120 రోజులకు కంకులు రావాలని, ఈ పంట చేతికి అంది వచ్చే సమయానికి ముందు కంకులు వచ్చిన పంట నేల రాలుతోందని బాధిత రైతులు ఆరోపించారు. దీంతో పంట పెట్టుబడులతో ఎకరానికి రూ.30 వేలు నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నకిలీ విత్తనాల తంతు ఏటా సాగుతున్నా క్షేత్రస్థాయిలో వ్యవసాయ, పోలీసు అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీంతో రైతులు ఈ నకిలీ విత్తనాలతో సాగు చేసి ఆశించిన దిగుబడులు రాక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకొని పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

## పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ విజయ సంకల్ప యాత్ర ప్రిపరేషన్ మీటింగ్ సోమవారం వరంగల్ జిల్లా, కార్యాలయం ధర్మారంలో, 15,16,17 డివిజన్ల బీజేపీ అధ్యక్షులు బిల్లా రమేష్, గోదాసి అశ్విన్ కుమార్, ఈదిగాని నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్ర్యమానికి ముఖ్య అతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ విచ్చేసి మాట్లాడుతూ 29 గురువారం సాయంత్రం 5 గంటలకు చలి వాగు నుంచి పరకాల బస్టాండ్ కూడలి వద్ద 5000 వేల మందితో నిర్వహించే స్ట్రీట్ కార్నర్ బీజేపీ విజయ సంకల్పయాత్రను పరకాల నియోజకవర్గంలో విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ విజయ సంకల్ప యాత్రలో 500 మోటార్ సైకిళ్లతో నిర్వహించే ర్యాలీలో ప్రతి కార్యకర్త విధిగా జెండా పెట్టుకొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలోని ప్రజలు, మేధావులు, పార్టీలకతీతంగా మోడీ వైపు చూస్తున్నారని అన్నారు. ప్రతి కార్యకర్త ఎంపీ ఎన్నికల వరకు సమయం ఇచ్చి కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి 17 ఎంపీలే లక్ష్యంగా భారతదేశ సరిహద్దు సైనికుల వలే పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతి కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు ఆరె కుమార్, కైరిక రవి కుమార్, సుంకరి రాజు, శక్తి కేంద్ర ఇంచార్జిలు బైకాని వెంకటేష్, పోలేబోయిన నవీన్, ల్యాదల్ల ప్రభాకర్, రాదారపు మల్లికార్జున్, లేంకలపెల్లి స్వామి, జేల్లా నాగరాజు, నవీన్ల రాములు, కందుల రవి వర్మ , పకిడే నర్సింగ రావు బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డబ్ల్యూటీఓ నుంచి భారత్ బయటికి రావాలి

## వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో ధర్నా




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ధనిక దేశాల ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నుంచి బయటికి రావాలని రైతు కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు సంయుక్త కిసాన్ మార్చా( ఎస్ కే యం), కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 20 నిమిషాల పాటు పోస్ట్ ఆఫీస్ జంక్షన్ లో ధర్నా నిర్వహించారు. 164 దేశాలతో కూడిన డబ్ల్యూటీవోలో ధనిక దేశాలదే ఆధిపత్యం అని వాటి కను సన్నలలోనే పేద దేశాల ప్రభుత్వాలు నడుచుకుంటున్నాయని వారన్నారు. డబ్ల్యూటీవో 1995 సంవత్సరంలో ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు పేద దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నా భిన్నమయ్యాయని, ఇందులో మన దేశం కూడా ఒకటని వారన్నారు. డబ్ల్యూటీవో సమావేశాలు నేటి నుంచి 29 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశంలోని అబుదాబిలో 13వ శిఖరాగ్ర సమావేశాలు జరగబోతున్నాయని, అందులో భారత ప్రభుత్వ ప్రతినిధులు ధనిక దేశాలకు అనుకూలమైన , సంతకాలు చేసే ప్రమాదం ఉందని వారు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలోని రైతాంగానికి పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలని కనీస మద్దతు ధర హక్కు చట్టం కోసం పోరాడుతుంటే దాని నిలువరించేది ఈ ధనిక దేశాలేనని వారు తెలిపారు. దేశ రైతాంగం పండించిన పంటలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థ పేద ప్రజలకు అందించేవని నేడు ఈ వ్యవస్థను రద్దుచేసి వారి ఖాతాల్లో డబ్బులు వేయాలని చూస్తున్నారని, దీనివల్ల రైతాంగం పండించిన ధాన్యం అమ్మకాలు జరగకపోవడంతో వీరి పరిస్థితి దుర్భరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వేచ్ఛ వాణిజ్యం పేరున ధనిక దేశాలలో పండించిన ధాన్యం మన దేశంలో దిగుమతి అయితే దేశీయ మార్కెట్లు దెబ్బతింటాయని, రైతుల పరిస్థితి అధ్వానంగా మారుతుందని అందువల్ల కేంద్ర అనుసరించే రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య, కోరబోయిన కుమారస్వామి, ఓదెల రాజయ్య, సుధమల్ల భాస్కర్, కార్మిక సంఘాల నాయకులు నర్రా ప్రతాప్, గన్నారపు రమేష్, ముక్కెర రామస్వామి, గంగుల దయాకర్, పసునూరి రాజు, ఎండీ బషీర్, జన్నారం రాజేందర్, ఎండీ పాషా, సంగతి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు సంస్కృతి సాహితీ సేవ ట్రస్టు స్వచ్ఛంద సేవా ట్రస్ట్ సంస్థ రి.నెం.34/23 ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకొని, వివిధ రంగాలలో కృషిచేసిన వారు జాతీయ నవ స్ఫూర్తి, నవ కీర్తి, లెజెండరి పురస్కారాలకు ఏప్రిల్ 28 వరకు దరఖాస్తులను చేసుకోవచ్చునని నిర్వాహకులు మాచవరం గౌరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరత నాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్యం, ఇంద్రజాలం, ముఖాభినయం, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, రంగస్థల కళాకారులు. జ్యోతిష్యం, సైన్స్ %౮% టెక్నాలజీ, వాస్తు, యోగా, డొలక్ హార్మోనియం, భజనకళా సామాజిక సేవా, క్రీడలు, షార్ట్ ఫిలిమ్, పర్యావరణ పరిరక్షణ గ్రామీణ అబివృద్ధి, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, వివిధరంగాలలో పనిచేస్తున్న వారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని నిర్వాహకులు తెలియజేశారు. ఈ పురస్కారలకు చివరి తేది 28-04-2024 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. వేదిక చిక్కడపల్లి తాగరాజా గాన సభ. హైదరాబాద్ లోను నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని పూర్తి వివరాలకు 73825 92852,99852 75385 నెంబర్లను సంప్రదించవచ్చని కోరారు.

## నేడు హనుమకొండకు మేడారం హుండీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మేడారం సమక్క-సారలమ్మ మహా జారత దిగ్విజయంగా ముగిసింది. దీంతో అధికా రులు నేడు మేడారం నుంచి హుండీలను హనుమకొండకు తరలించనున్నారు. హనుమకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఈనెల 29 నుంచి హుండీలను లెక్కించనున్నారు. మేడారం జాతరలో మొత్తం 512 హుండీలను అధికారులు ఏర్పాట్లు చేశారు. పది రోజుల పాటు లెక్కింపు కొనసాగనుంది.

## ప్రైవేటు వాహనాలపై చర్యలు తీసుకోవాలి




**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ ఆవరణలో ఉన్న పోచమ్మ గుడి వద్ద ప్రైవేట్ వాహనదారులు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులను ఇబ్బంది కలుగుతోంది. ములుగు జిల్లా కేంద్రంలో నడిపే ప్రైవేటు వాహనదార్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో వచ్చిన ప్రయాణికులను ఇబ్బందులను గురి చేస్తున్నారు. యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రైవేట్ వాహనాల యజమానులు దౌర్జన్యం చేస్తున్నారు. వీరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు అంటున్నారు. ములుగు జిల్లాలోని కాసిందే పేట్ గ్రామానికి చెందిన ప్రైవేటు వాహన దారుల యజమాని ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. ఇతడిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ విజయవంతం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ టాలెంట్ టెస్ట్ శారద స్కూల్ గర్ల్స్ హైస్కూల్, చైతన్య స్కూల్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ మాట్లాడుతూ ఈ టెన్త్ టాలెంట్ టెస్ట్ విద్యార్థుల్లో బోర్డ్ ఎగ్జాం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టడానికి అలాగే వారి సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కాబట్టి, విద్యార్థులందరూ నిరంతరం చదువుతూ పోరాడు- చదువుకై పోరాడు నినాదంతో ముందుకు సాగుతున్న ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న టెన్త్ టాలెంట్ టెస్ట్ విజయవంతంగా సాగుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు స్టాలిన్ శివ రంజిత్ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వీప్ అవేర్నెస్ ప్రోగ్రాం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లోక్ సభ ఎన్నికలలో ఓటు ప్రాముఖ్యతను తెలిపేందుకు గోపాల్ పూర్ చౌరస్తాలో స్వీప్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ స్వీప్ నోడల్ అధికారి భవాని శంకర్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి పి భాగ్యలక్ష్మి, మెప్మా టౌన్ ప్రాజెక్ట్ అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాలలోని చలివాగు వాటర్ ట్యాంక్ (పంప్ హౌస్) పైపులైన్లు, అక్కడున్న ట్రాన్స్ ఫార్మ్ ను, నూతనంగా నిర్మిస్తున్నటువంటి స్మశాన వాటిక పనులను మున్సిపల్ చైర్ పర్సన్ సోదా అనిత రామకృష్ణ సోమవారం పరిశీలించారు. త్వరగా పనులను పూర్తి చేయాలని కోరారు. పనులు నాణ్యతతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, రెండో వార్డ్ కౌన్సిలర్ ఒంటేరు చిన్న సారయ్య, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, మున్సిపల్ ఏఈ వంశీ, విద్యుత్ శాఖ అధికారులు డీఈ, ఏఈ, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఎండీ షబ్బీర్ అలీ, విద్యుత్ శాఖ లైన్ మెన్ తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని రంగశాయిపేటలో ఇటీవల దామర గుట్టల వాకర్ సొసైటీ సభ్యుడు దున్నాల గోపాల్ రావు అకాల మరణం పట్ల వాకర్స్ సొసైటీ సభ్యులు సోమవారం గోపాలరావు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పలకరించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే వాకర్ సొసైటీ తరపున వారి కుటుంబ సభ్యులకు రూ.11వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కుల్ల వీరస్వామి, బక్కి రవీందర్ బక్కి నాగేందర్, గుండు మోహన్, కందికొండ కుమార్, గోపాల కుమారస్వామి, శంకేసి కిరణ్, దేవులపల్లి సంపత్, పోతు రమేష్, బక్కి శ్రీధర్, గాదే రవి, కేదాశి రాజేష్, బజ్జూరు ప్రభాకర్, రావుల రాజు, షేర్ల అనిల్, జువాడి సాగర్, రాజు, రాజేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు:** మండల కేంద్రంలోని రావిరాల గ్రామంలో నూతన సీసీ రోడ్ల పనులను సోమవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లికుదుర్ మండల కేంద్రానికి సంబంధించిన సీసీ రోడ్లు నిర్మాణానికి రూ. 2.65 కోట్లు మంజూరు చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి తప్పిదాలు చేసిన నాణ్యత లేకుండా ఇష్టానుసారంగా సీసీ రోడ్లను పోసిన వారిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల వ్యవధిలోనే ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం చాలా గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని పలు సమస్యల గురించి చర్చించారు.

## కెనాల్‌లో జారిపడి యువకుడి మృతి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండల పరిధిలో గల ఎలుకుర్తి గ్రామంలోని దేవాదుల సౌత్ కెనాల్ లో పడి యువకుడు దుర్మరణం చెందాడు. ఆదివారం సుమారుగా 9 గంటల సమయంలో దూడ రఘు తేజ 26 తండ్రి కుమారస్వామి నివాసం ఉర్సు కరీమాబాద్ వరంగల్ తన స్నేహితులైన మండల పవన్ కుమార్ తాత దినకర్యకు నరసింగరావుపల్లికి వెళ్ళి బహిర్ భూమి కి వెళ్ళి కెనాల్ లోకి నీరు కోసం దిగి ప్రమాదవశాత్తు జారీ కెనాల్ లో పడిపోయాడు. ఈ విషయాన్ని తన అన్న ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

## మోడీ నియంత పరిపాలనను గద్దె దించాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత వారం రోజుల నుంచి ఢిల్లీలో రైతులు గిట్టుబాటు ధర కోసం ఆందోళన నిర్వహిస్తున్న క్రమంలో పోలీసులు రైతులపై కాల్పులు జరపడం మూలంగా రైతులకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో కరీమాబాద్ ఎస్బీఐ బ్యాంకు వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు గిట్టుబాటు ధర కోసం శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేస్తూ ఉంటే నిరంకుశంగా రైతులపై హర్యానా, పంజాబ్ సరిహద్దు పోలీసులు విచక్షణ రహితంగా రైతులపై కాల్పులు జరిపారు. కరణ్ సింగ్ తో పాటు మరో ఐదుగురు రైతులు పోలీసు కాల్పుల్లో చనిపోవడం జరిగిందన్నారు. దీని వెనకాల మోడీ హస్తం ఉందని మండిపడ్డారు. రైతే దేశానికి వెన్నుముక, అన్నం పెట్టే రైతులను నిరంకుశంగా అణిచివేయడం, పోలీసులతో కాల్చి చంపడం దురదృష్టకరమన్నారు. నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, గత సంవత్సరం ఆందోళన ఉద్యమాలు చేసిన రైతులకు రద్దు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చి చేతులు దులుపుకుందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం నరేంద్ర మోడీ అవివేకమన్నారు. అందుకోసమే మళ్లీ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న క్రమంలో పోలీసులు కాల్పులు జరగడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. చరణ్ సింగ్, మిగతా రైతులకు పోలీస్ కాల్పుల్లో మరణించిన రైతు కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, వారి కుటుంబంలో ఉన్న చదువుకున్న పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే ఎన్నికలలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి రైతులు, కార్మికులు, ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి, యాకూబ్ పాషా, యాదగిరి, మహబూబ్, సదానందం, రాజకుమార్, ఇస్మాయిల్, పెంటయ్య, జహీదా, జుబేదా, మార్గం కిరణ్మయి, కుమార్, ఎల్లమ్మ, బాలు, మహేష్, నాగేష్, కైలాసం, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక వ్యవహారాలలో ప్రజల్లో చైతన్యం పెరగాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఆర్థిక వ్యవహారాలలో ప్రజల్లో చైతన్యం పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ డేవిడ్ తెలిపారు. సోమవారం భారతీయ రిజర్వ్ బ్యాంకు రూపొందించిన పోస్టర్లను, పుస్తకాలను జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవహారాలపై ప్రజల్లో చైతన్యం అవసరమన్నారు. అదేవిధంగా సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తత అవసరమన్నారు. బ్యాంకు లావాదేవీల పట్ల నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని, అందుకు కావలసిన నైపుణ్యాలను పెంపొందించుకొని రుణాలపై విస్తృత అవగాహన పొందాలని సూచించారు. రుణాలపై అవగాహన లేకుండా పొందకూడదన్నారు. ప్రజలు కూడా తమ సొమ్మును కూడబెట్టుకోవడంతో పాటు పెంపొందించుకునేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని, వాటిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్థిరాస్తుల కోసం ఉన్నత విద్య కోసం రుణాలు పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమాదేవి, డీఆర్డీఏ పీడీ పురుషోత్తం, పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, ఎస్సీ వెల్ఫేర్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ నరసింహస్వామి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారికి మరమ్మతులు చేయండి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కాట్రపల్లి ప్రగతి సింగారం గ్రామాల మధ్య ఉన్న అతి ప్రధాన రహదారి గత వర్షకాలంలో కురిసిన వర్షాలకు 500 మీటర్లకు పైగా బీటీ రోడ్డు వరద ప్రవాహానికి కొట్టుకొని పోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 9 నెలలు గడుస్తున్నా కూడా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారే తప్పా పట్టించుకోవడం లేదు. దీంతో కాట్రపల్లి, నూర్జహాన్ పల్లి, గొల్లపల్లి, రాజుపల్లి, సాధనపల్లి, మల్లంపల్లి గ్రామాలకు సంబంధించిన రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతవారం కాట్రపల్లి గ్రామానికి చెందిన సుదగాని భిక్షపతి తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ ఆర్ అండ్ బీ శాఖ అధికారులు పట్టించు కోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని చర్యలు తీసుకోవాలని మాజీ మండల కో ఆప్షన్ షేక్ గౌస్, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# రైతు వ్యతిరేక విధానాలను మోడీ విరమించుకోవాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచి పెడుతూ రైతులను, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకు వచ్చిన మూడు చట్టాలను ఉపసంహరించుకోవాలని దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేపట్టిన చారిత్రాత్మక పోరాటం ఫలితంగా కేంద్రం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, వ్యవసాయ, సహకార రంగాలను కార్పొరేట్ శక్తులకే అప్పగించేందుకు నిర్ణయించిందన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం లేదని, కౌలు రైతుల రక్షణకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. కార్మిక చట్టాలను మార్చారని, చివరకు వామపక్షాల ఒత్తిడి వల్ల వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గించి ఈజీఎస్ ను కూడా నీరు గార్చే ప్రభుత్వం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలపై పెను భారం మోపే విధంగా నిత్యావసర వస్తువుల ధరలను భారీగా పెంచి కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు లక్షల కోట్ల రాయితీలు కల్పించారని అన్నారు. ఇలాంటి ప్రజా, రైతుల, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిన మోడీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, మారుపాక అనిల్, నెట్టం నారాయణ, పొట్టెపాక రవి, బాషబోయిన సంతోష్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, శంకర్ నాయక్, కొంగల రామ్ చంద్రారెడ్డి, మనోహర్, రమేష్ దేవా తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేయండి




**వరంగల్ వాయిస్, ములుగు :** దేశ రాజధాని ఢిల్లీలో కనీస మద్దతు ధర కోసం రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా సోమవారం సీపీఐ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయడం కోసం గత సంవత్సరం జరిగిన పోరాటంలో 1000 మంది రైతులు అమరత్వం చెందారన్నారు. అయినా పోరాటం విడవని సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి దేశ రైతాంగానికి క్షమాపణలు చెప్పి చట్టాలను రద్దు చేస్తూ ఒక ఆరు నెలలు సమయం ఇవ్వండని కోరారు. కనీసం మద్దతు ధరకు చట్టం చేస్తామని ఆనాడు రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు సమ్మె విరమించారు. ఆ కనీస మద్దతు ధర నేటికీ అమలు చేయని సందర్భంలో మళ్లీ పోరాటానికి పిలుపునిస్తే నిరంకుశమైన విధానాలతో రైతు ఉద్యమాలపై అణచివేత ప్రదర్శిస్తూ జరిపిన పోరాటంలో మరొక యువరైతు ప్రాణాలు పోగొట్టుకోవడం జరిగిందన్నారు. అదే కాక మరొక రైతు గుండెపోటుతో మరణించారని తెలిపారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావించాలన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ ఏమాత్రం భేషజాలకు పోకుండా వెంటనే రైతులకు కనీస మద్దతు ధరకు చట్టం తీసుకురావాలని, అలాగే స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలా జరగని పక్షంలో తెలంగాణ రాష్ట్రంలో సైతం రైతాంగం సమరశీల ఉద్యమాలకు సిద్ధం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ముత్యాల రాజు, బండి నరసయ్య, అంజద్ పాషా, ఇంజం కొమురయ్య, శ్యాంసుందర్, నటరాజ్, రమేష్, రాకేష్, రైతు సంఘం నాయకులు మహేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## డబ్ల్యూటీఓ నుంచి భారత్ వైదొలగాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ సెంటర్ ముందు సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గం పిలుపులో భాగంగా జిల్లా కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రహదారులను దిగ్బంధం చేస్తూ మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ గుజ్జు దేవేందర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న ఎస్ కే యం నాయకులు నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నేడు అబుదాబిలో డబ్ల్యూటీవో సదస్సు ప్రారంభమవుతున్న సందర్భంగా భారతదేశ వ్యాప్తంగా క్విట్ ఇండియా డే పాటిస్తూ ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి భారత వైదొలగాలని కోరారు. ఢిల్లీలో రైతాంగ రెండు సంవత్సరాల క్రితం రాతపూర్వకంగా బీజేపీ మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని , కనీస మద్దతు ధర చట్టం చేయాలన్నారు. రైతు రుణ విముక్తి చట్టం చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2020ను రద్దు చేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని, రైతాంగ పోరాటంలో అసువులు బాసిన వారికి రూ.1 కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల ట్రాక్టర్లను ధ్వంసం చేసిన పోలీసులపై చర్యలు తీసుకొని ట్రాక్టర్లను మరమ్మతు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ కేయం కన్వీనర్లు గునిగంటి రాజన్న, నందగిరి వెంకటేశ్వర్లు, ఎస్కే తాజ్ పాషా, సక్క, కొమిరెల్లి సోమన్న, ఎస్కే బాబు, హెచ్ లింగ్యా, పి బాలమల్లు, తోకల వెంకన్న, లక్ష్మయ్య, కొమ్ము సోమయ్య, సామా పాపయ్య, కట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్ట పరిహారం ఇప్పించండి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నకిలీ విత్తనాలు అంట గట్టిన షాపు యజమానిపై చర్యలు తీసుకొని పంట నష్ట పరిహారం అందజేయాలంటూ రాస్తారోకో చేపట్టిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. షాపు యజమానిపై చర్యలు తీసుకొని నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు భూక్యా రాందాస్ మాట్లాడుతూ శ్రీ బాలాజీ అగ్రీ మాల్ షాప్లో ఆర్ఎన్ఆర్ నకిలీ వరి విత్తనాలను10 మంది గిరిజన రైతులు కొనుగోలు చేసి 30ఎకరాలలో సాగు చేశామన్నారు. ప్రస్తుతం 30ఎకరాలలో సాగు చేసిన 50రోజులకే పంట కంకులు వేసిందని, 120 రోజులకు కంకులు రావాలని, ఈ పంట చేతికి అంది వచ్చే సమయానికి ముందు కంకులు వచ్చిన పంట నేల రాలుపోతుందని బాధిత రైతు ఆరోపించారు. దీంతో పంట పెట్టుబడులతో ఎకరానికి రూ.50 వేలు నష్టపోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. షాపు యజమాని నకిలీ విత్తనాల విషయం తెలియజేయగా నీకు దిక్కున్నచోట చెప్పుకో నువ్వు నన్ను ఏం చేయలేవని దురుసుగా సమాధానం ఇచ్చారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నకిలీ విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై చర్యలు తీసుకొని పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

సోమవారం 26, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# ఉపాధి పనుల పెండింగ్ బిల్లులను చెల్లించాలి

## కేవీపీఎస్ నేత జిన్నా లచ్చయ్య



**వరంగల్ వాయిస్,మరిపెడ :** మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) మహబూబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అబ్బాయి పాలెం గ్రామంలో కొమ్ముకుంట రాళ్ల దగ్గర జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. గత సంవత్సరం చేసిన పనులకు బిల్లులు రాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారని లచ్చయ్య పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గత బడ్జెట్ లో 80 వేలకోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం బడ్జెట్ లో కేవలం 60 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉపాధి కూలీలకు రావలసిన బిల్లులను సకాలంలో చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందని కేంద్ర ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. అంతేగాక మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న కూలీలు ఇప్పటికే పనులు లేకుండా నష్టపోగ, గ్రామీణ ప్రాంతకూలీలకు రావలసిన నిధులను వారికి రాకుండా దారి మళ్లిస్తుందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా 200 రోజుకు పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ 2005 లో వామపక్షాల సహకారంతో ఆనాటి యూపీఏ ప్రభుత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఈ చట్టాన్ని తీసుకురాగా, ఆ చట్టానికి తూట్లు పొడుస్తూ బీజేపీ ప్రభుత్వం నిధులను ఇతర రంగాలకు దారి మళ్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క వ్యవసాయ రంగం సంక్షోభంలో నెట్టు వేయగా రియల్ ఎస్టేట్ వ్యాపారంతో వ్యవసాయ భూములన్నీ వ్యాపార కేంద్రాలుగా మారాయాన్నారు. సంవత్సరానికి సరిపోను పనులు లేక కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, వారికి రావలసిన గడ్డపార, పారా, తట్టలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బి.సంధ్య, ఆర్.శోభారాణి, కౌసల్య, ఊరుకొండ వెంకన్న, అలవాల సీతారాములు, జినక కృష్ణమూర్తి, సువార్త, కత్తుల మహేష్ ఎల్లమ్మ, కోల మన్సూర్, తోపాటు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ తెలిపారు. సోమవారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అధికారులు గ్రీవెన్స్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి ప్రజలకు సమాధానం తెలపాలన్నారు. ఈ సందర్భంగా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన తాళ్ల సోమలక్ష్మి గ్రామంలోని తనకు చెందిన భూమి సర్వే నెం.110,111,112 గల మిగులు భూమి వేరే ఇతర వ్యక్తులు తమ పేర్లపై నమోదు చేసుకున్నారని రీ సర్వే చేసి తన భూమిని తనకు రిజిస్ట్రేషన్ చేసి పట్టా ఇవ్వాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ లో (76) దరఖాస్తులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, సీపీఓ సుబ్బారావు, జిల్లా అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం మూడు (3) దరఖాస్తులు రాగా (2) రెవెన్యూ , (1) ఇతర శాఖకు చెందినవి ఉన్నాయి. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మేడారం మహా జాతర విజయవంతం చేసిన అధికారులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా అధికారులు వచ్చే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వేణుగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, వైద్య అధికారి అలేం అప్పయ్య , షెడ్యూల్ కులాల అధికారి తుల రవి, పంచాయతీరాజ్ అజయ్ కుమార్ , ఎల్ డీఎం రాజ్ కుమార్, తహసీల్దార్ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

# ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

## 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం
## ఒక నిమిషం ఆలస్యమైన అనుమతించరు



**వరంగల్ వాయిస్, జనగామ :** ఇంటర్మీడియేట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్య అధికారి శాఖ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరట్ లోని డీఐఈవో కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 28 నుంచి మార్చి 16 వరకు ఇంటర్మీడియేట్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. జిల్లాలో (మొదటి, రెండవ) సంవత్సరం కలిపి మొత్తం 9140 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. కాబట్టి, మొదటి సంవత్సరం నుంచి జనరల్ విద్యార్థులు మొత్తం 3166, వొకేషనల్ విద్యార్థులు 1197 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. అదే విధంగా రెండవ సంవత్సరం నుంచి జనరల్ విద్యార్థులు 3578, వొకేషనల్ విద్యార్థులు 1198 మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 18 పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించినట్లు తెలిపారు. అలాగే హల్ టికెట్, పెన్, పెన్సిల్, రబ్బర్, ఎగ్జామ్ ప్యాడ్, మాథెమాటికల్ పరికరాలు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు వివరించారు. నోటు బుక్కులు, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయన్నారు. జిల్లాలో జనగామ మండలానికి (10,) నర్మెట్టకు ఒకటి, స్టేషన్ ఘనపూర్ కు 3, జాఫర్ గఢ్ కు ఒకటి, పాలకుర్తికి ఒకటి, కొడకండ్ల కు ఒకటి, దేవరుప్పుల కు ఒకటి మొత్తం (18) పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. https://tsbie.cgg.gov.in వెబ్ సైట్లో నుంచి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం పరీక్షల కోసం విద్యార్థులు పడే మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు (14416) టోల్ ఫ్రీ నంబర్ కు సంప్రదించాలని కోరారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా నిపుణులు తగు సలహాలు, సూచనలు అందిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయరాజు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వేసవి కాలం దృష్ట్యా ఎక్కడ కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఇతర అధికారులతో వేసవి కాలంలో తాగునీటి గురించి సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో తాగునీటి పైపులైన్ల లీకేజీ సమస్య ఎక్కువ ఉందని, వాటి మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మసాగర్, వడ్డేపల్లి, కేయూ ఫిల్టర్ బెడ్ ల నుంచి తాగునీటి సరఫరా బాగుండే విధంగా చర్యలు చేపట్టాలని, ఆ ఫిల్టర్ బెడ్ల అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. తాగునీటి సమస్యలు రాకుండా ప్రతి రోజు ఈ అంశంపై అధికారులు సమీక్షించాలన్నారు. అదేవిధంగా నయీంనగర్ నాలా అభివృద్ధి పనులు జరిగేటప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా దారి మళ్లింపునకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలన్నారు. నయీం నగర్ నాలా అభివృద్ధి పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్ అంశంపై ట్రాఫిక్ సీఐ సీతా రెడ్డిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా రానున్న రంజాన్ పండుగ, సాగునీటి కి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎం. ఎ. భారీ, ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, మైనార్టీ వెల్ఫేర్ డిడి మేన శ్రీను, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ ప్రదీప్ చంద్ర, కృష్ణారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకన్న, ఈఈ రాజయ్య, ఎలక్ట్రికల్ ఈఈ సంజయ్, ఇరిగేషన్ అధికారులు ఆంజనేయులు, హర్షవర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల పర్వం - మన దేశానికి గర్వం

## కేంద్ర స్వీప్ నోడల్ అధికారి భవాని శంకర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న పార్లమెంట్ ఎన్నికల లో ఓటు పర్సెంటేజ్ పెంచేందుకు స్వీప్ ఆక్టివిటీస్ లో బాగంగా సోమవారం వర్ధన్నపేట నియోజక వర్గం పరిధి గోపాల్ పూర్ లో జిల్లా స్వీప్ నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో స్వీప్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్వీప్ నోడల్ అధికారి భవాని శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారికి జిల్లా నోడల్ అధికారి పుష్పగుచ్ఛం తో స్వాగతం పలికారు. ముందుగా ఓటు అవగాహన పై పాల్గొన్న వారిచే ఓటు పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్వీప్ నోడల్ అధికారి మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎక్కడైతే ఓటు పర్సెంటేజీ తగ్గిన ప్రాంతంలో ఓటరు అవేర్నెస్ పై స్వీప్ అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచన మేరకు ఎన్నికల పర్వం - మన దేశానికి గర్వం అనే నినాదం తో ముందుకు వెళ్లాలన్నారు. ఇది అన్ని శాఖల అధికారులు ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ప్రముఖ కూడళ్లలో మానవ హారాలు నిర్వహించి ఓటు పై ప్రతిజ్ఞ చేయించాలని అన్నారు. ఓటు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా చేయాలని వారు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల పై అవేర్నెస్ లో భాగంగా తక్కువ ఓటర్స్ నమోదైన ప్రాంతంలో 5000 పోలింగ్ స్టేషన్లను గుర్తించడం జరిగింది. వాటిపై స్వీప్ అవేర్నెస్ కల్పించడం లో బాగంగా ఈ రోజు గోపాల్ పుర్ లో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. దీనిలో భాగంగా వర్ధన్నపేట నియోజక వర్గం నుంచి పోలింగ్ బూత్ నెం. 83, 87లో 50 శాతం కంటే తక్కువ పోలైనట్టు గుర్తించడం జరిగిందన్నారు. తక్కువ పోలింగ్ జరిగిన ప్రాంతంలో ప్రజలను అవేర్నెస్ కల్పించి ఓటింగ్ శాతం పెంచేచా ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓట్లు వేయాలన్నారు. దీనిలో మెప్మా టౌన్ ప్రాజెక్ట్ అధికారి రాజేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి తమ తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యతో రాష్ట్ర నోడల్ అధికారి భవాని శంఖర్ ఈ అంశంపై చర్చిస్తూ ఓటరు శాతం పెంచుటకు వారం వారం యాక్షన్ ప్లాన్ ను, మైక్రో ప్లానింగ్ ను ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి వాసంతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, జిల్లా పంచాయితీ శాఖ అధికారి కల్పన, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, సంబంధిత అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సోనీ ఝలక్ దిఖలా జాలో శ్రీరామచంద్ర






ఇండియన్ ఐడల్(2010) విన్నర్ శ్రీరామ చంద్ర గురించి తెలియని వారు లేరు. సంగీతమే శ్వాసగా కెరీర్ ప్రారంభించిన ఆయన ఎనిమిదేళ్ల వయసు నుంచే పాడటం ప్రారంభించారు. ఎన్నో సంగీత పోటీల్లో పాల్గొని ట్రోఫీలు అందుకున్నారు. తెలుగులో విజయవంతమైన చిత్రాలకు పాటలు పాడిన ఆయన 2010లో ఇండియన ఐడల్ కాంపిటీషన్లో పాల్గొని విజేతగా గెలిచి తెలుగు వారి సత్తా చాటారు. తదుపరి ఆయన ఎన్నో చిత్రాల్లో పాటలు పాడి గుర్తింపు తెచ్చుకున్నారు. అంతే కాదు సినిమాల్లో హీరోగా నటించారు. పలు చిత్రాలు కీలక పాత్రలు పోషించారు. 2 ఏళ్ల తర్వాత ఆయన మరోసారి సోనీ టీవీలో సందడి చేయనున్నారు. సోనీ టీవీలో జరుగుతున్న సెలబ్రిటీ డాన్స్ షో 'ఝలక్ దిఖలా జా'లో శ్రీరామ చంద్ర పార్టిసిపేట్ చేస్తున్నారు. పోటీలో సెమీ ఫైనల్స్‌కి చేరుకున్నారు. ట్రోఫీ గెలవడానికి తెలుగువారంతా తమ ఓటుతో సపోర్ట్ చేయాలని సంగీత కళాకారులు పిలుపునిచ్చారు.

## 22న వస్తోన్న రోటి కపడా రొమాన్స్





టాలీవుడ్ యువ నటులు హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్ నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోటి కపడా రొమాన్స్' . ఈ సినిమాకు విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ పెయిన్ ఆఫ్ 'రోటి కపడా రొమాన్స్' పేరిట ఫిబ్రవరి 27న స్పెషల్ వీడియో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇక ఈ చిత్రం మార్చి 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం, వంటి యూత్ ఫుల్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన లక్కీ మీడియా సంస్థ అధినేత బెక్కెం వేణుగోపాల్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. సృజన్ కుమార్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు.

## ఎంజాయ్ చేయలేకపోయా

'యానిమల్' సినిమా నటిగా కూడా రష్మికను మరో మెట్టుపైన నిలబెట్టింది. ఆ సినిమా సాధించిన విజయం కూడా సామాన్యమైన విజయం కాదు. దాదాపుగా వెయ్యికోట్ల రూపాయలు గ్రాస్ వసూళ్లను రాబట్టింది. బాలీవుడ్‌లో విజయాలను అందుకోవడం చాలామంది హీరోయిన్ల కల. మరి ఆ కల నిజమైనా.. ఆ ఆనందాన్ని ఆస్వాదించలేకపోవడంపై రష్మిక ఇటీవల సోషల్‌మీడియాలో మాట్లాడింది. ' మా 'యానిమల్' పై ప్రశంసలు కురిశాయి. డబ్బులు కూడా అంతకంటే బాగా కురిశాయి. అయితే.. ఆ విజయాన్ని ఎంజాయ్ చేయలేకపోయాను. కనీసం ప్రమోషన్స్‌లో కూడా ఎక్కువగా పాల్గొనలేకపోయాను. దానికి కారణం ఒప్పుకున్న ప్రాజెక్ట్‌లే. నేను చేస్తున్న సినిమాలన్నీ ప్రతిష్టాత్మకమైనవే. ఆ సినిమాల షూటింగులకోసం రాత్రింబవళ్లూ ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి. అందుకే 'యానిమల్' టీమ్‌తోపాటు అభిమానుల్ని కూడా మిస్ అయ్యాను. ఆ లోటును నా రాబోయే సినిమాలు భర్తీ చేస్తాయని భావిస్తున్నాను. అభిమానుల ప్రేమ ఇచ్చేంత సంతోషం నాకు ఏదీ ఇవ్వదు' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక మందన్నా..



## మారిషస్‌లో ఎంజాయ్ చేస్తున్న అనుపమ



టాలీవుడ్‌లో పరిచయం అక్కర్లేని మలయాళ కుట్టి అనుపమ పరమేశ్వరన్.తన కర్లీ హెయిర్‌తో, చబ్బీ లుక్స్‌తో టాలీవుడ్‌లో కోట్లాదిమంది అభిమానులు, ఫాలోవర్లను సంపాదించుకుంది. కార్తికేయ 2తో బ్లాక్ బస్టర్ హిట్టు ఖాతాలో వేసుకున్న ఈ భామ.. ఇటీవలే ఈగల్ సినిమాలో నటించి మెప్పించింది. ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళ సినిమాలు చేస్తుంది. ఇక త్వరలో టిల్లు స్క్వేర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ భామ.. షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చి వెకేషన్‌కు చెక్కేసింది. తాజాగా మారిషస్ టూర్‌కు వెళ్లిన వీడియోను అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. మారిషస్ అడవుల్లో రోప్ డైవింగ్, సైకిల్ తొక్కడం, కార్ రేస్, బోటింగ్, బీచ్‌లు సెలయేళ్ల వద్ద ఫుల్‌గా ఎంజాయ్ చేస్తూ సాహసాలు చేసింది. అంతేకాకుండా అడవిలో ఉన్న జంతువులను పలకరిస్తూ.. ప్రకృతిని ఆస్వాదించింది. తాజాగా ఈ అడ్వెంచర్‌నంతా వీడియో రూపంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. కాగా ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి

**కలెక్టర్ పి.ప్రావీణ్య**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతి ఒక్కరూ తమ ఆదాయంలో కొంత భాగం పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య పిలుపునిచ్చారు. ఆర్థిక వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాజ్, డీఆర్డీఓ పీడీ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, సంబంధిత బ్యాంకు అధికారుల సమక్షంలో ఈ నెల 26 నుంచి మార్చి 1 వరకు నిర్వహించే ఆర్బిఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2024 గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించుటకు భారతీయ రిజర్వు బ్యాంక్ ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో అక్షరాస్యత నిర్వహిస్తోందన్నారు. ప్రతి మనిషి తమ ఆర్థిక స్వీయ నియంత్రణకు బడ్జెట్ వేసుకొని, తమ సంపాదనలో కొంత భాగం సాధారణ ఖర్చుల కోసం, మరికొంత భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు అలవాటు చేసుకోవాలని తద్వారా ఆర్థిక ఇబ్బందుల బారిన పడకుండా ఉంటారన్నారు. భవిష్యత్ ప్రణాళికలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం విద్యార్థులకు చేరాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సురక్షితమైన బ్యాంకింగ్ విధానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. డిజిటల్ చెల్లింపులతో పాటు, సైబర్ నేరాల బారిన పడకుకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.. ఇతరులకు ఏటీఎం పిన్ నంబరు, బ్యాంక్ వివరాలు చెప్పకూడదన్నారు. అందరూ డిజిటల్ లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు విద్యాలక్ష్మి పోరల్ ద్వారా తకణమే రుణాలు మంజూరు. చేసేలా బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## విజ్ఞప్తులు సత్వరమే పరిష్కరించాలి..

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులతో మమేకమై వారి సమస్యలను సావధానంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పరిష్కరించుటకు వీలులేని పక్షంలో తదుపరి చర్యల కోసం వారికి అర్థమయ్యే విధంగా సూచనలు అందించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 60 విజ్ఞప్తులను అదనపు కలెక్టర్ డీఆర్డీఏ పీడీ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ కృష్ణ వేణిలతో కలిసి స్వీకరించారు. ఈ ప్రజావాణి లో జిల్లా పంచాయతీ అధికారి కల్పన, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, సంబంధిత, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇవ్వండి

**మరోసారి మోడీని గెలిపించండి**

**విజయ సంకల్ప సభ సన్నాహక సమావేశం**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న పార్లమెంట్ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రలో భాగంగా కాకతీయ- భద్రకాళీ క్లస్టర్ బస్సు యాత్ర మార్చ్ నెల 1న వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. అదే రోజు ఉదయం 10:00 గంటలకు హనుమకొండ వెయ్యి స్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హనుమకొండ చౌరస్తాలో ఉదయం 10:30 గంటలకు కార్నర్ మీటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. మీటింగ్ అనంతరం వయా పోలీస్ హెడ్ క్వార్టర్స్, అమరవీరుల స్థూపం, నుంచి కాజీపేట వరకు బైక్ ర్యాలీ ఉంటుందని, ఈ యాత్రలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని రావు పద్మ కోరారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్ దీన్ దయాళ్ నగర్ లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మార్చ్ 01న వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరిగే విజయసంకల్ప యాత్ర సన్నాహక సమావేశం బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారి డా.వి.మురళీధర్ గౌడ్, మాజీ మేయర్ డా.టి. రాజేశ్వర్ రావులతో కలిసి పాల్గొన్నారు. బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారి మాట్లాడుతూ నేడు భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఈ యాత్ర విజయవంతం కోసం ప్రతి డివిజన్ ఇంఛార్జి బాధ్యతగా భారీగా జన సమీకరణ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశినీ సదానందం గౌడ్, నియోజకవర్గ ప్రభారి నరెడ్ల ప్రవీణ్ రెడ్డి, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, మాజీ కార్పొరేటర్లు రావుల సుదర్శన్, మిద్దేల బాబు, జిల్లా పదాధికరులు, వివిధ డివిజన్ అధ్యక్షులు, ఇంఛార్జిలు పాల్గొన్నారు.



# 28న ఆత్మకూరులో ధర్నా

**పాల్గొననున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు**

**విజయవంతం చేయాలని చల్లా పిలుపు**

**వరంగల్ వాయస్, పరకాల :** అకారణంగా బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి, థర్డ్ డిగ్రీ ఉపయోగించిన పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలో వారి నివాసం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ గ్రామంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరలో అమ్మవార్ల దర్శనం కోసం నేను కుటుంబ సమేతంగా వెళ్లినప్పుడు కార్యకర్తలు జై తెలంగాణ నినాదాలు చేశారని, దీంతో తప్పుడు కేసులు బనాయించి ఆదివారం తెల్లవారుజామున ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను కిడ్నాప్ చేసిన విధంగా తీసుకొని వెళ్లి విచక్షణారహితంగా థర్డ్ డిగ్రీ ఉపయోగించి చితకబాదిన కేసులో వరంగల్ పోలీస్ కమిషనర్ సమగ్ర దర్యాప్తు కోసం ఆదేశించడం జరిగింది. పూర్తి నివేదిక అందిన వెంటనే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి, థర్డ్ డిగ్రీ ఉపయోగించి హింసించిన పోలీస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రేపటి వరకు సమయం ఇవ్వాలని సీపీ కోరారని తెలిపారు. వరంగల్ సీపీపై ఉన్న నమ్మకంతో రేపటి వరకు వేచి చూస్తామని తెలిపారు. ఒకవేళ సంబంధిత పోలీస్ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోని యెడల బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఆత్మకూరు మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వరంగల్ రెడ్ క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు, సంగెం జడ్పీటిసి గూడ సుదర్శన్ రెడ్డి, దామెర వైస్ ఎంపీపీ ఎండీ జాకీర్ అలీ, నాయకులు గోల్కొండ శ్రీనివాస్, కన్నెబోయిన రమేష్ పాల్గొన్నారు.

# గుండెజారి గల్లంతయ్యింది..

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మానుకోట జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ల రిజర్వేషన్లు అనేకమంది ఆశావాహులకు గుండెజారి గల్లంతయ్యిందే. గత ప్రభుత్వం మానుకోట మార్కెట్ చైర్మన్ బీసీకి రిజర్వ్ చేయగా అనేకమంది ఆశావాహులు పోటీపడ్డారు. ముఖ్యంగా డోర్నకల్, కురవి మండలాల నుంచి గౌడ్, ముదిరాజ్ కులాలకు చెందిన నాయకులు పోటీ పడగా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన కత్తెరసాల విద్యాసాగర్ కు రెడ్యానాయక్ ఆశీర్వదించి మార్కెట్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఇదిలా ఉండగా గత మార్చి నెలలో మార్కెట్ పదవి బాధ్యతలు చేపట్టి ఏడాది దాటక ముందే ప్రభుత్వం మారిపోవడంతో మార్కెట్ చైర్మన్ ఎంపిక దృశ్యం కాంగ్రెస్ నాయకులు చేతిలోకి మారిపోయింది. దీంతో మరల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి కోసం కమ్మ, కాపు, గౌడ్, పద్మశాలి, ముదిరాజ్ సామాజిక వర్గం నాయకులు తమకు అనుకూలంగా రిజర్వేషన్ వస్తుందని పదవి కోసం ఉవ్విళ్లురారు. ఇదీలా ఉండగా ఎవరు ఊహించని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు పెద్దపీట వేస్తూ మార్కెట్ చైర్మన్ ను ఎస్టీ కేటగిరికి రిజర్వ్ చేసింది. దీంతో మార్కెట్ చైర్మన్ పదవి తనకంటే తనకే వస్తుందని ఆశపడ్డ డోర్నకల్, కురవి మండల నాయకులు ఆశలు అడియాశలయ్యాయి. కాగా ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఏ నాయకుడికి మార్కెట్ చైర్మన్ పదవి అందబోతుందనే చర్చ మొదలైంది. ఈ ప్రాంతం నుంచి మోతుబార్ నాయకుడు ఎవరు ఉన్నారంటూ ఎస్టీ నాయకుల కోసం వేట మొదలైంది. ఎంపీ ఎన్నికల కంటే మునుపే చైర్మన్ మార్కెట్ చైర్మన్ పదవిని భర్తీ చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తుంది.

# డేంజర్ జోన్‌లో ఉన్న ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించాలి

**తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ఎదుట ప్రజల ధర్నా**



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్లలో డేంజర్ జోన్ పరిధిలో ఉన్న ఇళ్లను వెంటనే సేకరించి ,నష్ట పోయిన వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ తాడిచెర్ల గ్రామ ప్రజలు సోమవారం ఓపెన్ కాస్ట్ మైన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా డేంజర్ జోన్‌లో ఉన్న ఇళ్ల స్థలాలు ప్రభుత్వం సేకరించాలని అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్న ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, డేంజర్ జోన్ పరిధిలో ఉన్న తమ ఇళ్లు బ్లాస్టింగ్ ల దాటికి బీటలు వారుతున్నాయని, భూగర్భ జలాలు తగ్గి పోయి బోర్లు ఎండిపోయి పంటలు పండే అవకాశం లేకుండా పోయింది. స్థానికుల ధర్నా తో ఓపెన్ కాస్ట్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కేటీపీసీ చెల్పూర్ సీఈ సిద్దయ్య సంఘటన స్థలానికి చేరుకొని డేంజర్ జోన్ లో ఉన్న ప్రజలతో మాట్లాడారు. ప్రజల సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టి కి తీసుకువెళ్లీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ప్రజలు ధర్నాను విరమించారు. నాలుగు నెలల్లో తమ సమస్యకు పరిష్కారం చూపాలని లేకుంటే ఓపెన్ కాస్ట్ లో పనులను అడ్డుకుంటామని ఈ సందర్బంగా ప్రజలు సీఈకి తెలిపారు. ధర్నా నేపథ్యంలో కాటారం డీఎస్పీ రామ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కాటారం సీఐ, మహాదేవపూర్ సీఐ, కాటారం సబ్ డివిజన్ ఎస్సై లు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com